సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

SK1 one NEWS HD

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 181 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | ఆదివారం 20-09-2026




**చెబితే నేనే భోజనం పెట్టి పాలం చూపించేవాడ్ని: హరీశ్ రావు**

- సిద్దిపేటలో తన భూముల పరిశీలనపై హరీశ్ రావు స్పందన
- వస్తున్నారని చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ
- అబద్ధాలు ప్రచారం చేయొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు

## సమస్యలను వేగంగా
# పరిశీలించి పరిష్కారం

### పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ

ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్

**ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం**

భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన

క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి



హైదరాబాద్: తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

**సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం**



- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ

## బెంగాల్ ఉపపోరు: మమత వర్గం పార్టీకి 'ఫుట్‌బాల్ ప్లేయర్'.. రెబల్ వర్గానికి 'ఎన్వలప్'



- తృణమూల్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలకు కొత్త పేర్లు, గుర్తులు కేటాయింపు
- మమత వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు ఖరారు
- రెబల్ వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్'గా గుర్తింపు
- మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్', ఆరూప్ వర్గానికి 'ఎన్వలప్' చిహ్నం
- బెంగాల్ ఉపఎన్నికల కోసం ఈసీ తాత్కాలిక ఏర్పాటు

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి.. 15 మంది మృతి



- పాకిస్థాన్‌లోని కోహట్‌లో మసీదుపై ఉగ్ర దాడి
- ఈ ఘటనలో ఐదుగురు పోలీసులతో సహా 15 మంది మృతి
- 50 మందికి పైగా తీవ్ర గాయాలు, పలువురి పరిస్థితి విషమం
- పోలీసు కార్యాలయమే లక్ష్యంగా దాడి జరిగినట్లు అనుమానం
- ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించలేదు



**దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!**

- దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్
- ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వ ఎంవోయూ
- ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల సామర్థ్యం

**రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం: విజయసాయిరెడ్డి**



- సీమ ప్రాంత అభివృద్ధికి ప్రతిరూపంగా కొత్త పార్టీ రాబోతోందన్న విజయసాయిరెడ్డి
- టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యతనిచ్చాయని విమర్శ
- యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి రతనాలసీమగా మారుస్తానని హామీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి,

# విశాఖకు ఐటీ కళ..
# అమరావతిలో క్వాంటం విప్లవం

### రూ.526 కోట్ల పెట్టుబడులతో 10 ఐటీ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

- అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ హబ్.. రూ.2,700 కోట్లతో సృష్టి క్వాంటం సంస్థ
- లోకేశ్ ప్రత్యేక చొరవ... ఏపీకి ఐటీ, క్వాంటం కంపెనీల క్యూ.. వేల ఉద్యోగాలకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషితో ఏపీకి తరలివస్తున్న టెక్ కంపెనీలు
- విశాఖలో డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ భారీ ఆపరేషన్స్ సెంటర్ల ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,000 కొత్త ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో రాష్ట్రానికి దిగ్గజ ఐటీ, మిగతా 2 లో



**'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'.. ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్**

- టీఎంసీ పేరు, గుర్తును తాత్కాలికంగా ఫ్రీజ్ చేసిన ఎన్నికల సంఘం
- మమతా వర్గానికి రాహుల్ గాంధీ మద్దతు
- ఈసీ, బీజేపీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు
- రెండు టీఎంసీ వర్గాల మధ్య పేరు, గుర్తుపై వివాదం
- కొత్త పేర్లు, గుర్తులు ఎంచుకోవాలని ఈసీ ఆదేశం

## విశాఖను గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడమే
# లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

### సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ

- విశాఖకు ఐటీ కళ.. చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ కీలక నిర్ణయాలు
- రూ.526.25 కోట్ల విలువైన 10 ఐటీ ప్రాజెక్టులకు ఆమోదముద్ర
- విశాఖలో భారీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల మిగతా 2 లో

## బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి: రేవంత్ కు కేటీఆర్ సవాల్

హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు ప్రయత్నించామని వెల్లడి

కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మిగతా 2 లో

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం
## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం

హైదరాబాద్: సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

హైదరాబాద్: సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

## బెంగాల్ ఉపపోరు: మమత వర్గం పార్టీకి
## 'ఫుట్‌బాల్ ప్లేయర్'.. రెబల్ వర్గానికి 'ఎన్వలప్'

బెంగాల్ : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలోని రెండు వర్గాలకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నూతన పేర్లను, ఎన్నికల చిహ్నాలను కేటాయించింది. పార్టీలో తలెత్తిన అంతర్గత వర్గపోరు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఈసీ కేటాయించింది. అదే సమయంలో, అరూప్ రాయ్ నేతృత్వంలోని అసమ్మతి వర్గానికి 'డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును ఖరారు చేస్తూ, 'ఎన్వలప్' గుర్తును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు సెప్టెంబర్ 17న, టీఎంసీ అసలు పేరును, చిహ్నాన్ని ఈ రెండు వర్గాలు ఉపయోగించకుండా ఎన్నికల సంఘం తాత్కాలిక నిషేధం విధించింది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఈ చర్యలు చేపట్టింది. దీంతో రెండు వర్గాలు తమకు నచ్చిన పేర్లు, గుర్తుల జాబితాను ఈసీకి సమర్పించగా, వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం తాజాగా ఈ కేటాయింపులు చేసింది.

## విశాఖను గ్లోబల్ టెక్ హబ్‌గా
## మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీలో రాష్ట్రానికి రూ.526.25 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే 10 ఐటీ ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టులన్నీ ప్రధానంగా విశాఖపట్నం కేంద్రంగా రానుండటంతో, నగరం త్వరలో గ్లోబల్ టెక్ హబ్‌గా మారనుంది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో దిగ్గజ ఐటీ కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, దీని ఫలితంగానే తాజా పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో రెండు భారీ సంస్థలు విశాఖలో తమ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్, రూ.43.75 కోట్ల పెట్టుబడితో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. అదేవిధంగా, ప్రముఖ ఫైనాన్స్ సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల పెట్టుబడితో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కార్యకలాపాల కోసం 2,400 సీట్లతో మరో భారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఈ రెండు కంపెనీల రాకతోనే దాదాపు 5,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. మొత్తం 10 ఐటీ ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలపగా, వీటిలో 7 ప్రాజెక్టులు అత్యాధునికమైన క్వాంటం టెక్నాలజీకి సంబంధించినవి కావడం విశేషం. ఈ నిర్ణయాలతో విశాఖపట్నం ఐటీ స్వరూపం పూర్తిగా మారిపోనుందని, యువతకు భారీ ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..
## రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ' (ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

## దశాబ్దాల నిరీక్షణకు తెర.. విశాఖలో
## 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు

అమరావతి: దశాబ్దాలుగా సొంత ఇంటిపై హక్కు కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాలకు పట్టాలు అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సెప్టెంబర్ 19న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు అందించనున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు ఆయా స్థలాలను క్రమబద్ధీకరించి పూర్తి హక్కులు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 11 మండలాల పరిధిలో 19,33,853 చదరపు గజాల స్థలాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కార్యక్రమం కాదని.. ఇళ్లపై కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కు కల్పించే కీలక ఘట్టమని చంద్రబాబు అన్నారు. పట్టా ద్వారా కుటుంబాలకు ఆస్తి, భవిష్యత్తుకు భద్రత, పిల్లలకు వారసత్వ హక్కు లభిస్తాయని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణతో ఏళ్లుగా హక్కుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఊరట లభించనుంది. సెప్టెంబర్ 19న విశాఖలో చంద్రబాబు లబ్ధిదారులకు పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు అందించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేస్తూనే సామాన్య కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం
### విజయసాయిరెడ్డి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా త్వరలోనే నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీ రాబోతోందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. అనంతపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చాయని... అసలైన రాయలసీమ పౌరుషాన్ని, ప్రాంతీయ సంక్షేమాన్ని కాపాడే బాధ్యతను తమ నూతన పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు పునరుద్ధరించలేదని ఆయన నిలదీశారు. రాష్ట్ర విభజన అనంతరం సీమ ప్రాంతానికే చెందిన నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలు కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయం చేస్తూ, సీమ నుంచి ప్రజల వలసలకు ప్రధాన కారణమయ్యారని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని... అన్ని కులాలు, మతాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు.

# విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో రాష్ట్రానికి దిగ్గజ ఐటీ, ఫ్యూచర్ టెక్నాలజీ కంపెనీలు భారీ ఎత్తున తరలివస్తున్నాయి. శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఈ భేటీలో రూ.526.25 కోట్ల పెట్టుబడులతో 8,896 ఉద్యోగాలు కల్పించే 10 కీలక ఐటీ ప్రాజెక్టులకు, అలాగే క్వాంటం టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టించగల పలు ప్రాజెక్టులకు బోర్డు ఆమోదముద్ర వేసింది.

విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

ఐటీ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన చొరవతో విశాఖపట్నం మరోసారి ఐటీ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. తాజాగా జరిగిన ఎస్ఐపీబీ భేటీలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డెలాయిట్, విశాఖలో రూ.43.75 కోట్ల పెట్టుబడితో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించింది. అదేవిధంగా, ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల పెట్టుబడితో వైజాగ్‌లో "ఇంటిగ్రేటెడ్ హబ్ ఏఐ & టెక్ ట్రైనింగ్ సెంటర్"ను నెలకొల్పనుంది. ఈ కేంద్రం ద్వారా 2,400 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు, రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ఇందులో భాగంగా సృష్టి క్వాంటం ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,700 కోట్ల భారీ పెట్టుబడితో క్వాంటం కంప్యూటింగ్ హార్డ్‌వేర్, నానోఫ్యాబ్రికేషన్ తయారీ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఒక్క ప్రాజెక్టుతోనే దాదాపు 3,000 ఉద్యోగాలు రానున్నాయి. వీటితో పాటు క్వాంటం కోడాన్, అరోహాక్ టెక్నాలజీస్, ట్రిక్వాంటా లాబ్స్, ఫోటాన్‌కోర్ సిస్టమ్స్, వెరిడేటా హెల్త్ వంటి సంస్థలు కూడా అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఈ కంపెనీల రాకతో క్వాంటం ఏఐ, డ్రగ్ డిస్కవరీ, ఫోటోనిక్స్ క్వాంటం రీసెర్చ్ వంటి అత్యాధునిక రంగాల్లో రాష్ట్ర యువతకు ఉజ్వల అవకాశాలు లభించనున్నాయి.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి. కడప జిల్లాలో ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ రూ.70 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న యూనిట్‌కు ప్రోత్సాహకాల గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. తాజా నిర్ణయాలతో విశాఖపట్నం, అమరావతి, కడప వంటి ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. లోకేశ్ నాయకత్వంలో ఐటీ రంగంలో వస్తున్న ఈ మార్పులు, రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## బీఆర్ఎస్ నాయకులను
## టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..
## సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

హైదరాబాద్: తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

## 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'..
## ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్



ఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్' అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా' అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫ్లవర్స్ అండ్ గ్రాస్' గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి..
## 15 మంది మృతి



ఢిల్లీ: పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కోహట్ నగరంలో శుక్రవారం ఓ మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటనలో ఐదుగురు పోలీసు అధికారులతో సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు కార్యాలయాల సముదాయానికి సమీపంలో ఉన్న మసీదులోకి ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో దూసుకెళ్లాడు. ఈ భారీ పేలుడు ధాటికి మసీదు కుప్పకూలగా, సమీపంలోని పోలీసు భవనం ప్రహరీ గోడ సైతం నేలమట్టమైంది. అనంతరం, తుపాకులతో సాయుధులైన మరో ఇద్దరు ఉగ్రవాదులు పోలీసు ప్రాంగణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. గాయపడిన వారిలో అధికశాతం ప్రార్థనల కోసం వచ్చినవారేనని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కిరాతక దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు. పొరుగునే ఉన్న హంగూ జిల్లాలో గురువారం జరిగిన బాంబు దాడిలో ఆరుగురు సైనికులు మరణించిన మరుసటి రోజే ఈ దారుణం జరగడం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో పాకిస్థానీ తాలిబన్లు (టీటీపీ) భద్రతా దళాలు, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేశారు. కాగా, తాజా దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు.

## వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో
## కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలి



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌ని కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారిని కలిసి వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వివరాలతో వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. ౹పీఎం౹+ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ అందుకు కేంద్ర మంత్రి గారికి ముఖ్యమంత్రి గారు కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతిపత్రం అందించిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రి గారిని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

## ఎల్‌నినో నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం



అమరావతి: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కాదు, మ్యాన్ మేడ్ కరవు నెలకొందని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ఎల్‌నినోతో కరవు పరిస్థితులు నెలకొంటాయని ఫిబ్రవరి 4నే చెప్పిన చంద్రబాబు.. తర్వాత కరవు నివారణ చర్యల్లో చేసింది సున్నా అని ఆరోపించారు. జూన్ నుంచి వరుస నెలల్లో లోటు వర్షపాతం ఉంటే కరవు మండలాలను ఇప్పటి వరకూ ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి వైకాపా ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'నీళ్లిస్తున్నాం సాగు చేసుకోండని జులై 11న సీఎం, ఆయన మంత్రులు చెప్పడం వల్ల రైతులు సాగు ప్రారంభించారు. 56.4 లక్షల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. 2023 ఖరీఫ్ పంట బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన రూ1,400 కోట్లను 2024 జూన్‌లో చంద్రబాబు కట్టి ఉంటే రైతులకు సుమారు రూ.3 వేల కోట్ల మేలు జరిగేది. కానీ కట్టలేదు' అని పేర్కొన్నారు.

పోలవరంలో రాజీపడ్డారు

'పోలవరంలో 45.72 మీటర్ల ఎత్తు వరకు అయితేనే 194 టీఎంసీల నీటిని నిల్వ చేయగలరు. దాన్ని కేంద్రం 41.15 మీటర్లకు కుదిస్తే చంద్రబాబు రాజీపడ్డారు. ఫలితంగా 120 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాన్ని, ఈ ప్రాజెక్టుకు కేంద్రం భరించాల్సిన రూ.60 వేల కోట్లలో సుమారు రూ.30 వేల కోట్లను వదులుకున్నారు. పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకువెళ్లి పోలవరం నుంచి ఉత్తరాంధ్రకు నీటిని తీసుకువచ్చినట్లు చంద్రబాబు డ్రామా చేశారు' అని జగన్ విమర్శించారు. కరవు మండలాలను వెంటనే ప్రకటించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.


## కేసీఆర్, హరీశ్ రావు భూములపై
## పూర్తి ఆధారాలు ఉన్నాయి: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

# ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి, నూతన గ్రామ కమిటీల నిర్మాణం





**వెల్దుర్తి,సెప్టెంబర్ 19 (సీమకిరణం న్యూస్ ) :** వెల్దుర్తి మండల కేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నగారి ఆదేశాల మేరకు,గత రెండు రోజులుగా వెల్దుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎం ఆర్ పి ఎస్ మరియు ఎం ఎస్ పి గ్రామ కమిటీల నూతన నిర్మాణ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమం ఎం ఆర్ పి ఎస్ మరియు ఎం పి ఎస్ మండల మాజీ నాయకులు ఎన్ గిడ్డయ్య మాదిగ, ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళామండలి నాయకులు రెడ్డి పోగు విజయ్ మాదిగ మండల ఇన్చార్జి పాముల కుమార్ మాదిగ కాశపోగు సూరి మాదిగ పాల్గొని నూతనంగా ఎంపికైన గ్రామ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల సాధన, సామాజిక సమానత్వం మరియు రాజ్యాధికారలి సాధన లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి సంఘటిత శక్తిని మరింత బలోపేతం చేసి, రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకునే దిశగా ముందుకు సాగాలని తెలిపారు. అలాగే యువత, మహిళలు మరియు ప్రతి కుటుంబాన్ని ఉద్యమంలో భాగస్వామ్యం చేసి, సామాజిక గౌరవం, సమానత్వం, విద్య, ఉపాధి మరియు రాజకీయ సాధికారత కోసం నిరంతరం కృషి చేయాలని నాయకులు సూచించారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని వెల్దుర్తి టౌన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా రెడ్డి పోగు మనోహర్ మాదిగ ఉపాధ్యక్షులుగా సొలుమోను మాదిగ అధికార ప్రతినిధిగా మహేష్ . ప్రధాన కార్యదర్శి కల్యాణ మాదిగ .ఎంఎస్పి అధ్యక్షులు పసుల బ్రహ్మం ఉపాధ్యక్షులు ఎం రాము అధికార ప్రతినిధి ఎర్రన్న ని ఎన్నుకోవడం జరిగింది. పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎం బజార్ అన్న మాదిగ. జగ్గుల బజార్ మాదిగ. మోష మాదిగ. బాలరాజు మాదిగ. నాయకంటి సూర్యచంద్ర మాదిగ. పసుల సిద్దయ్య మాదిగ. సురేష్. రాజబాబు. రాము .సుంకన్న. అయ్యన్న .మనోహర్. శ్రీను .నారాయణ. ప్రేమ రాజు .రాకేష్ .జీవరత్నం .మహే ష్ . పరమేశు. నూతనంగా ఏర్పడిన ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి గ్రామ కమిటీలు ఉద్యమాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసి, అణగారిన వర్గాలకు సమానత్వం, ఆత్మగౌరవం, రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.

# దివ్యాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్



**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 19, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు నగరంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మౌర్య ఇన్ లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షులు రంజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొని 20 మంది దివ్యాంగులకు కృత్రిమ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. సమాజంలో అవసరమైన వారికి అండగా నిలుస్తూ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ద్వారా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాలను అందించడం ద్వారా వారి జీవితాల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రంజిత్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఆకాంక్షించారు. రంజిత్ చిన్న తరహా పరిశ్రమను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసిందని, దీనికి ప్రభుత్వం తరఫున, తన వంతుగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ప్రజా సేవలో భాగంగా టీజీవి గ్రూప్ తరఫున కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి అండగా నిలిచి, అవసరమైన వారికి సహాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పామన్న, తదితరులు పాల్గొన్నారు.



# కర్నూలులో వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు..!

కొత్త ఈద్గా వద్ద 3,500 మందికి పైగా ముస్లిం సోదరుల ప్రార్థనలు



**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 19, (సీమకిరణం న్యూస్):** వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ కర్నూలు పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు శనివారం ఉదయం సంతోష్ నగర్‌లోని కొత్త ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 7:45 గంటల వరకు 'నమాజ్-ఎ-ఇస్తిస్ఖా' ప్రత్యేక నమాజ్ నిర్వహించి, వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. ఈ ప్రత్యేక ప్రార్థనలో కర్నూలు పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 3,500 మందికి పైగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈద్గా ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా ఆదివారం, సోమవారం కూడా ఉదయం కొత్త ఈద్గా వద్ద 'నమాజ్-ఎ-ఇస్తిస్ఖా' ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షాల కోసం ప్రార్థించాలని వారు కోరారు.

# ఇది మీకు తెలుసా పాన్ కార్డ్ పై రూ. 5 లక్షల రుణం

నేటి డిజిటల్ యుగంలో పాన్ కార్డ్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదు, ఆర్థిక లావాదేవీలలో మీ విశ్వసనీయతకు రుజువుగా మారింది. పాన్ నంబర్ అనేది భారత ప్రభుత్వ ఆదాయపు పన్ను శాఖ జారీ చేసిన 10 అంకెల ఆల్ఫాన్యూమరిక్ గుర్తింపు సంఖ్య. ఇది పౌరుల ద్రవ్య లావాదేవీలను పర్యవేక్షిస్తుంది. ఇప్పుడు దాదాపు ప్రతి బ్యాంకు ఖాతాకు పాన్ కార్డును లింక్ చేయడం తప్పనిసరి అయ్యింది. ఇది రుణ సంస్థలు మీ %ఖ్జ%ని ధృవీకరించడం సులభతరం చేసింది. ఆధార్ కార్డుతో లింక్ చేయడం వల్ల, పాన్ ప్రామాణికత, భద్రత మరింత పెరుగుతుంది. అందుకే ఇప్పుడు పాన్ కార్డు ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకోవడం సాధారణ, సులభమైన ఎంపికగా మారింది.

### పాన్ కార్డ్ లోన్ తీసుకునేటప్పుడు ఈ విషయాన్ని గుర్తుంచుకోండి

మీరు పాన్ కార్డ్ ద్వారా రూ. 5 లక్షల వరకు వ్యక్తిగత రుణం తీసుకోవాలనుకుంటే మీకు ప్రభుత్వం జారీ చేసిన పాన్, ఆధార్ కార్డ్ రెండూ అవసరం. రెండు కార్డులు ఒకదానికొకటి లింక్ చేయబడి ఉండటం ముఖ్యం. ఎందుకంటే లేకపోతే, రుణ ప్రక్రియ ఆలస్యం కావచ్చు. రెండు పత్రాలు లింక్ చేయబడితే, రుణం ఆమోదించినా 24 గంటల్లోపు మొత్తం మీ ఖాతాకు బదిలీ అవుతుంది. మీకు పాన్ కార్డ్ లేకపోతే లేదా అది ఆధార్‌తో లింక్ కాకపోతే మీకు రుణం లభించే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి.

### రుణం కోసం ఈ పత్రాలు అవసరం:

పాన్ కార్డుపై రూ.5 లక్షల రుణం పొందడానికి ఈ కిందిపత్రాలు అవసరం:

గుర్తింపు రుజువుగా ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఓటరు.

చిరునామా రుజువుగా ఈ పత్రాలలో ఏదైనా ఒకటి.

గత మూడు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు.

ఫారం 16 తో ఇటీవలి రెండు నెలల జీతం స్లిప్ లేదా జీతం సర్టిఫికేట్.

### పాన్ కార్డ్ లోన్ ప్రత్యేక లక్షణాలు:

పాన్ కార్డుపై వ్యక్తిగత రుణం పొందే ప్రక్రియ చాలా సులభం. దీని కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిలో ప్రాథమిక వివరాలను మాత్రమే పూరించాలి. పాన్ ద్వాం ప్రక్రియను పూర్తి చేయాలి. ఈ రకమైన రుణం తక్షణ ఆమోదం పొందుతుంది. అందుకే మీరు అత్యవసర పరిస్థితుల్లో కూడా త్వరగా డబ్బు పొందవచ్చు. మీరు వివిధ బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలను పోల్చినట్లయితే, మీరు వడ్డీ రేట్ల ప్రయోజనాన్ని కూడా పొందవచ్చు. దీని కోసం పత్రాల సంఖ్య కూడా చాలా తక్కువ. పాన్, ఆధార్ మాత్రమే సరిపోతాయి. అలాగే, తిరిగి చెల్లించడానికి అనువైన %జువీ×% సౌకర్యం ఉంటుంది. దీని కాలపరిమితి 6 నెలల నుండి 96 నెలల వరకు ఉంటుంది.

### పాన్ కార్డ్ లోన్ కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

ముందుగా మీరు పాన్ కార్డుపై వ్యక్తిగత రుణం ఇచ్చే బ్యాంక్ లేదా ఫైనాన్స్ కంపెనీని ఎంచుకోవాలి. దీని కోసం వడ్డీ రేటు, రుణ మొత్తం, తిరిగి చెల్లించే నిబంధనలు, సంస్థ విశ్వసనీయతను గుర్తుంచుకోవాలి. తరువాత సంబంధిత బ్యాంకు వెబ్‌సైట్‌కి వెళ్లి 'ఇప్పుడే దరఖాస్తు చేసుకోండి' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయండి. మొబైల్ నంబర్, %ూ% నింపిన తర్వాత దరఖాస్తు ఫారమ్‌లో మీ పేరు, పాన్ నంబర్, పుట్టిన తేదీ, పిన్ కోడ్‌ను పూరించండి. ఇప్పుడు "ప్రొసీడ్" పై క్లిక్ చేసి, లోన్ మొత్తాన్ని, రకాన్ని (టర్మ్, ఫ్లెక్సీ టర్మ్, ఫ్లెక్సీ హైబ్రిడ్) ఎంచుకోండి. తరువాత లోన్ వ్యవధిని ఎంచుకుని, కేవైసీ వివరాలను పూరించడం ద్వారా ఫారమ్‌ను సమర్పించండి.

### అర్హత ప్రమాణాలు




పాన్ కార్డ్ లోన్ కోసం దరఖాస్తుదారుడు భారత పౌరుడై ఉండాలి. అతని వయస్సు 21 నుండి 60 సంవత్సరాల మధ్య ఉండాలి. పాన్ కార్డ్ కలిగి ఉండటం అవసరం. క్రెడిట్ స్కోరు బాగా ఉండాలి. అలాగే, శాశ్వత, సాధారణ ఆదాయ వనరు ఉండాలి. వ్యక్తి ఉద్యోగి అయినా లేదా స్వయం ఉపాధి పొందుతున్నా. అలాగే, రుణం నుండి ఆదాయం (%ఙు×%) నిష్పత్తి తక్కువగా ఉండాలి. ఉదాహరణకు, మీ నెలవారీ ఆదాయం రూ.50,000, మీ నెలవారీ రుణం, క్రెడిట్ చెల్లింపులు రూ.28,000 అయితే, 56% అవుతుంది. సాధారణంగా 40% కంటే తక్కువ మంచిదని పరిగణిస్తారు.

### పాన్ కార్డ్ ఎక్కడ ఉపయోగపడుతుంది?

పాన్ కార్డు రుణాలకు మాత్రమే కాకుండా, ఆదాయపు పన్ను చెల్లించడం, రూ.5 లక్షల కంటే ఎక్కువ విలువైన ఆస్తిని కొనుగోలు చేయడం, వాహనం కొనడం లేదా అమ్మడం, క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడం, బ్యాంకు ఖాతా తెరవడం, షేర్లు మరియు బాండ్లలో రూ.50,000 కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టడం, అద్దెకు ఇవ్వడం, ఆన్‌లైన్ వ్యాపారం ప్రారంభించడానికి కూడా అనేక ముఖ్యమైన ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఉపయోగిస్తారు. పాన్ తప్పనిసరి.

# బంగారం ధర రూ.19,000 తగ్గుతుందా? కారణాలు ఏంటి



దిగుమతి ఒప్పందాలపై ట్రంప్ కాస్త భిన్నమైన వైఖరి తీసుకున్న తర్వాత ప్రపంచ మార్కెట్లు ఇప్పుడు స్థిరత్వాన్ని చూస్తున్నాయి. ఫలితంగా బంగారం ధర కూడా తగ్గింది. అందువల్ల ఈ పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే రాబోయే కాలంలో బంగారం ధర 80 వేలకు తగ్గవచ్చని అంచనా.. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. బంగారం కూడా లక్ష దాటి కాస్త వెనక్కి వచ్చింది. అయితే, ఇప్పుడు బంగారం ధరలో తగ్గుదల చూస్తున్నాము. ఇంతలో భవిష్యత్తులో బంగారం ధర 19,000 రూపాయల వరకు తగ్గే అవకాశం ఉందని ఇప్పుడు వ్యక్తమవుతోంది. బంగారం 19 వేలు ఎందుకు చౌకగా మారవచ్చు? దాని వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి?

### బంగారం చౌకగా మారవచ్చు:

కొన్ని రోజుల క్రితం బంగారం ధర తోలకు రూ. లక్ష దాటింది. అయితే, ఇప్పుడు బంగారం దాదాపు 7 నుండి 8 వేలు తగ్గింది. ఇంతలో బంగారం ధర రాబోయే నాలుగు నుండి ఆరు నెలల్లో దాని ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి నుండి 19,000 వరకు తగ్గవచ్చు.

### బంగారం ఎంత చౌక అవుతుంది?

రాబోయే నాలుగు నుండి ఆరు నెలల్లో బంగారం ధర రూ. 80,000 కు తగ్గే అవకాశం ఉందని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ సురేష్ కేడియా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బంగారం ధర పది గ్రాములకు 80 నుండి 85 వేలకు చేరుకునే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంతో దిగుమతి ఒప్పందం పెంచడం వల్ల బంగారం ధరలు పెరిగాయి. దిగుమతి ఒప్పందాలపై ట్రంప్ కాస్త భిన్నమైన వైఖరి తీసుకున్న తర్వాత ప్రపంచ మార్కెట్లు ఇప్పుడు స్థిరత్వాన్ని చూస్తున్నాయి. ఫలితంగా బంగారం ధర కూడా తగ్గింది. అందువల్ల ఈ పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే రాబోయే కాలంలో బంగారం ధర 80 వేలకు తగ్గవచ్చని అంచనా.

### బంగారం ధరలు తగ్గడానికి కారణాలు ఏమిటి?

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బంగారం ధర నిరంతర హెచ్చుతగ్గులను చూసింది. జనవరిలో బంగారంలో పెట్టుబడిదారులు దాదాపు 21 శాతం రాబడిని పొందారు. బంగారం ఒక సంవత్సరంలో దాదాపు 32 శాతం రాబడిని ఇచ్చింది. దీని వెనుక చాలా కారణాలున్నాయి. ప్రపంచ ఉద్రిక్తతలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు బంగారం ధరల పెరుగుదలకు దారితీశాయి. అయితే ప్రస్తుతం ప్రపంచ ఉద్రిక్తతలు తగ్గాయి. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాశ్వత కాల్పుల విరమణ కోసం అమెరికా ప్రయత్నిస్తోంది. అందువల్ల, బంగారం ధరలు పెరగడానికి ఉన్న అనుకూలమైన పరిస్థితులు ఇప్పుడు లేవు. అందుకే బంగారం ధర తగ్గుతోంది.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు

మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి





**ప్యాపిలి, సెప్టెంబర్ 19 (సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండల వైసీపీ విస్తృత స్థాయి సమావేశం మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మండలంలో విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. కార్యకర్తలు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ శ్రేణులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో చవిటి లక్ష్మీదేవి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, న్యాయవాది నాగభూషణం రెడ్డి, గజేంద్ర రెడ్డి,పోతు దొడ్డి కృష్ణమూర్తి, చిట్టి రెడ్డి,రాజా మురళి , భువనేశ్వర్ రెడ్డి, బోరెడ్డి రాము,రజనీ కాంత్ రెడ్డి, పుల్లారెడ్డి , రాంచంద్ర రెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, చిన్న రమంజీ,చిన్న సుంకయ్య,బాలయ్య ,జక్కులచెరువు కొండయ్య,బోరా మల్లి కార్జున రెడ్డి, జింక్కల అంజి, బంగి నాగరాజు, రామసుబ్బయ్య , మస్తాన్ ఖాన్, నిజాం,వైఎస్ఆర్సిపి నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో మాజీ మంత్రి బుగ్గన ప్రత్యేక పూజలు




**ప్యాపిలి, సెప్టెంబర్ 19 (సీమ కిరణం న్యూస్) :** రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్యాపిలి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయానికి వచ్చిన భక్తులతో, స్థానికులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## డోన్ లో ఘనంగా "యువత భవితకు భరోసా" - ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాత





**డోన్ టౌన్, సెప్టెంబర్ 19,(సీమ కిరణం న్యూస్);** పట్టణంలోని స్థానిక సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మరియు నంద్యాల పార్లమెంట్ బైరెడ్డి శబరి విచ్చేశారు. యువతతో ముఖాముఖి:కార్యక్రమంలో భాగంగా అతిథులు ఇద్దరూ విద్యార్థులు, యువతతో నేరుగా ముచ్చటించారు. యువతీ యువకులు తమ ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో పాటు ప్రస్తుత సమాజంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను అతిథుల దృష్టికి తీసుకెళ్లారు. యువత వ్యక్తపరిచిన అభిప్రాయాలను ఆసక్తిగా విన్న కోట్ల సుజాతమ్మ, బైరెడ్డి శబరి గారలు వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) వంటి అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. దేశ భవిష్యత్తు యువతే: ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని, తమ ప్రతిభను సమాజ మార్పుకు, అభివృద్ధికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. యువతలో ఆత్మవిశ్వాసం నింపడానికి, వారి భవిష్యత్తుకు సరైన దిశానిర్దేశం చేయడానికి ఈ వేదిక ఎంతగానో తోడ్పడిందని వారు పేర్కొన్నారు. ఈ విజయవంతమైన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు యువత భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎం.పీ బైరెడ్డి శబరి




**డోన్ టౌన్, సెప్టెంబర్ 19,(సీమ కిరణం న్యూస్):** డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలు, విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. 'గ్రీన్ ఆంధ్ర-కూల్ ఆంధ్ర' అనే నినాదంపై ప్రత్యేక అవగాహన కల్పించడమే కాకుండా, కళాశాల ప్రాంగణంలో స్వయంగా మొక్కలు నాటారు. పట్టణంలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. నరేష్ రెడ్డి, ఆర్డీఓ నరసింహులు, పురపాలక సిబ్బంది, మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 25 లక్షలకుమించి ఉద్దేశపూర్వక డిఫాల్టర్లపై ఉక్కేయండి




బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ సూచనఉద్దేశ పూర్వక ఎగవేతదారులకు రిజర్వు బ్యాంక్ మరో షాకిచ్చింది. ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సెంట్రల్ బ్యాంక్ తాజాగా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రూ.25 లక్షలు అంతకంటే ఎక్కువ మొత్తంలో ఉన్న అన్ని నిరర్థక ఆస్తుల ఖాతాల్లో ఉద్దేశ పూర్వక ఎగవేతదారుల అంశాన్ని పరిశీలించాలని మంగళవారం ప్రత్యేక సూచనలు చేసింది. ప్రస్తుతం రుణాలను తీసుకున్న వారు తిరిగి చెల్లింపులు జరపలేకపోతే వారిని ఉద్దేశపూర్వక డిఫాల్టర్‌గా ప్రకటించడం జరుగుతున్నది.రూ.25 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ రుణం తీసుకొని ఎగ్గొట్టిన వారు లేదా వీరికి గ్యారెంటీగా ఉన్నవారు కూడా విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా గుర్తించనున్నారు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో ఉన్న అన్ని నిరర్థక ఆస్తుల ఖాతాలకు సంబంధించి తిరిగి రుణాలు ఆరు నెలల్లో చెల్లింపులు జరపకపోనటువంటి ఖాతాలను విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా గుర్తించనున్నారు. వీటిని గుర్తించేటప్పుడు అంతర్గతంగా పరిశీలించిన తర్వాతనే ఆ ఖాతాలను ఎన్‌పీఏగా ప్రకటిస్తారు.

## లాభాల్లో దేశీయ సూచీలు 285 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్




రెండ్రోజులుగా తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్న దేశీయ సూచీలు బుధవారం లాభాల బాటపట్టాయి. కంపెనీలు ప్రకటిస్తున్న ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో మదుపర్లు అమ్మకాలపై ఆసక్తి చూపించారు. దీంతో సోమ, మంగళవారాల్లో ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ సూచీలు బుధవారం లాభాలను కళ్లజూశాయి.మీ వివాహ కలను నెరవేర్చుకోడానికి 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న కాకతీయ మ్యారేజెస్ లో ఇప్పుడు ప్రీమియం మెంబర్షిప్ ఉచితం.రెండ్రోజులుగా తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్న దేశీయ సూచీలు బుధవారం లాభాల బాటపట్టాయి. కంపెనీలు ప్రకటిస్తున్న ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో మదుపర్లు అమ్మకాలపై ఆసక్తి చూపించారు. దీంతో సోమ, మంగళవారాల్లో ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ సూచీలు బుధవారం లాభాలను కళ్లజూశాయి. రోజంతా లాభాల్లోనే కదలాడిన సెన్సెక్స్ 285 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. నిఫ్టీ 93 పాయింట్లు ఎగబాకింది.మంగళవారం ముగింపు (81, 455)తో పోల్చుకుంటే దాదాపు 200 పాయింట్ల లాభంతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 400 పాయింట్లకు పైగా లాభపడి 81, 828 వద్ద ఇంట్రాడే హైని టచ్ చేసింది. చివరకు 285 పాయింట్ల లాభంతో 81, 741 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా అదే బాటలో పయనించింది. ఒక దశలో 140 పాయింట్లకు పైగా లాభపడింది. చివరకు 93 పాయింట్ల లాభంతో 24, 951 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్‌లో గ్రాన్యుయల్స్ ఇండియా, టాటా కమ్యూనికేషన్, ట్రెంట్, ఎస్ఆర్ఎఫ్ షేర్లు లాభాలు ఆర్జించాయి. ఇండియా మార్ట్, బిర్లా సాఫ్ట్, ఇండస్ టవర్స్, జేకే సిమెంట్ షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 367 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 54 పాయింట్లు ఎగబాకింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 83.72గా ఉంది.

## మీ వైఫై స్పీడ్ తక్కువుగా ఉందా.? ఇలా చేయండి పరిమితిలేని వేగాన్ని పొందండి




మీ స్మార్ట్ ఫోన్, టాబ్లెట్, స్మార్ట్ టీవీ ఇలా అనేక వాటి వినియోగంలో ఇంటర్నెట్ అవసరాన్ని పరిగణనలోకి తీసుకుంటే, వైఫై ఉపయోగం చాలా పెరిగింది.ప్రతి పరికరానికి సజావుగా పనిచేయడానికి వేగవంతమైన ఇంటర్నెట్ అవసరం. చాలా సార్లు వైఫై సరిగ్గా పని చేయక లేక మరేదో కారణంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ సరిగా ఉండదు. ఒక్కొక్కసారి వెబ్ సైట్ తెరవడానికి కూడా చాలా సమయం పడుతుంది. వైఫై ఇంటర్నెట్ వేగం నెమ్మదిగా మారడానికి గల కారణాలను ఓసారి తెలుసుకుందాం.వైఫై ఇంటర్నెట్ వేగం మీ నుండి రూటర్ దూరంపై కూడా ఆధారపడి ఉంటుంది. మీరు రౌటర్ నుండి ఎంత దూరంలో ఉంటే ఇంటర్నెట్ వేగం అంత తక్కువగా ఉంటుంది. దీని కారణంగా మీరు కనెక్షన్ డ్రాప్ ను ఎదుర్కోవలసి రావచ్చు. ఇది కాకుండా చాలా పరికరాలను వైఫైకి కనెక్ట్ చేయడం రూటర్ పాతది కావడం వల్ల వేగం కూడా నెమ్మదిగా మారవచ్చు. మీరు అపార్ట్మెంట్ లేదా జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతంలో నివసిస్తుంటే వైఫై సిగ్నల్ లో ప్రబ్లామ్స్ ను ఎదురుకుంటారు. నెమ్మదిగా ఇంటర్నెట్ వేగం సమస్య విషయంలో మీరు రూటర్‌ను 15 సెకన్ల పాటు ఆఫ్ చేసి ఆపై దాన్ని మళ్లీ ఆన్ చేయాలి. ఇది వేగాన్ని ప్రభావితం చేయవచ్చు. వైరస్ లు మీ పరికరంలో ఇంటర్నెట్ వేగాన్ని కూడా నెమ్మదిస్తాయి. అటువంటి పరిస్థితిలో పరికరాన్ని యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌తో స్కాన్ చేయాలి. అలాగే డివైస్ ఆపరేటింగ్ సిస్టమ్, యాప్ లను ఎల్లప్పుడూ అప్డేట్ చేస్తూ ఉండండి. ఇంకా రూటర్ నుండి దూరంగా ఉన్నప్పుడు 5 బ్యాండ్ స్పీడ్‌ని ఉపయోగించడం మంచిది.పాత నెట్‌వర్క్ డ్రైవర్‌లు మీ పరికరాన్ని వైఫైకి కనెక్ట్ చేయడంలో సమస్యలను కలిగిస్తాయి. మీరు వాటిని మాన్యువల్‌గా లేదా డ్రైవర్ అప్డేటర్ సాఫ్ట్‌వేర్ సహాయంతో అప్డేట్ చేయవచ్చు. మీ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ అందించిన డిఫాల్ట్ డొమైన్ నేమ్ సిస్టమ్ (%ణచీూ%)ని ఇతర %ణచీూ% సెట్టింగ్ లకు మార్చడం ద్వారా మీరు ఇంటర్నెట్ వేగం, నెట్‌వర్క్ కనెక్టివిటీని మెరుగుపరచవచ్చు. వైఫైకి కనెక్ట్ చేయబడిన పెద్ద సంఖ్యలో పరికరాలను డిస్ కనెక్ట్ చేయడం ద్వారా కూడా మెరుగుదలను చేయవచ్చు.

## ప్రాంప్ట్' ఇంజినీర్లకు డిమాండ్.. భారీగా శాలరీ ప్యాకేజీలు

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగం ఇది. దానికి సంబంధించిన కోర్సులు చేసే వారికి ప్రస్తుతం భారీ డిమాండ్ ఉంది. ఏఐ ఆధారిత యాప్స్, సాఫ్ట్‌వేర్స్, ఛాట్ బాట్స్ తయారీకి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి.దీంతో ప్రముఖ ఐటీ కంపెనీలు ఏఐ నిపుణుల రిక్రూట్‌మెంట్‌ను చేపడుతున్నాయి. ప్రత్యేకించి ప్రాంప్ట్ ఇంజినీర్ జాబ్స్‌ను భర్తీ చేస్తున్నాయి. ఇంతకీ ఏమిటీ ఉద్యోగం ? దీనికి అప్లై చేసేందుకు అర్హతలు ఏమిటి ? వివరాలివీ..ఎవరు అర్హులు ?ప్రస్తుతం ప్రాంప్ట్ ఇంజినీర్లకు మంచి డిమాండ్ ఉంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ఆంగ్ల భాషపై పట్టు ఉన్నవారు ఈ జాబ్స్‌కు అర్హులు. ప్రాంప్ట్ ఇంజినీర్లకు తొలుత ఏడాదికి రూ. 4 లక్షల దాకా వార్షిక వేతనం లభిస్తుంది. ప్రాంప్ట్ ఇంజినీర్ జీతం సగటున ఏడాదికి రూ.8 లక్షల నుంచి రూ. 13 లక్షల దాకా ఉంటుంది. ఏఐ సర్టిఫికేషన్ మెషీన్ లెర్నింగ్ సర్టిఫికేషన్ కలిగిన ఇంజినీర్లకు దాదాపు రూ. 20 లక్షల దాకా వార్షిక వేతనం ఉంటుంది.హైదరాబాద్ కోచింగ్ సెంటర్లపై సీఎం రేవంత్ దృష్టిప్రాంప్ట్ ఇంజినీర్స్ ఏం చేస్తారు ?ప్రాంప్ట్ ఇంజినీర్లు ఏఐ నుంచి అత్యంత కచ్చితమైన, అవసరమైన సమాచారం తెలుసుకునేందుకు అడగాల్సిన ప్రశ్నలు ఏమిటో గుర్తించాల్సి ఉంటుంది. హ్యూమన్ ఇంటెంట్, ఏఐ మోడల్ ఆర్కిటెక్చర్, ట్రైనింగ్ డేటా, టోకనైజేషన్ మోడల్?పై వీరికి అవగాహన ఉండాలి. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ) టెక్నాలజీలోనూ స్కిల్ అవసరం. ఛాట్ జీపీటీ, గూగుల్ జెమిని, డాల్-ఈ వంటి ఏఐ మోడల్స్? గురించి తెలిసి ఉండాలి. అనలిటిక్స్ సమాచారాన్ని ప్రాంప్ట్ ఇంజినీర్లు అర్థం చేసుకోవాలి. ఏఐ ప్లాట్ ఫామ్స్ ప్రవర్తన, ప్రదర్శనను అంచనా వేసేందుకు ఇన్ పుట్స్, ఔట్ పుట్స్‌ను పర్యవేక్షిస్తుండాలి. పైథాన్ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ తెలిసి ఉండాలి.

## మైక్రోసాఫ్ట్ 365 సర్వీసుల్లో సమస్యలు రెండు వారాల్లోనే రెండోసారి సాంకేతిక సమస్య




ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో మరోసారి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. మైక్రోసాఫ్ట్ 365 సర్వీస్‌లో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అనేక మంది సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.జులై 30 సాయంత్రం సమయంలో ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పనిచేస్తున్నట్లు తమ సోషల్ మీడియా అకౌంట్ ద్వారా వెల్లడించింది. జులై 19 న కూడా ఈ సమస్య తలెత్తింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలపై తీవ్ర ప్రభావం పడింది.ముఖ్యంగా విమాన సర్వీసులు రద్దు మరియు ఆలస్యంగా ప్రయాణించాయి. అయితే ఈ సమస్యను పరిష్కరించిన కొన్ని రోజుల అనంతరం మైక్రోసాఫ్ట్ కీలక ప్రకటన చేసింది. ఇదే తరహా సాంకేతిక సమస్య భవిష్యత్‌లోనూ ఎదురుకావచ్చని హెచ్చరించింది. ఇందుకు యూరోపియన్ కమిషన్ రూపొందించిన కొన్ని నిబంధనలు కారణమని ఆరోపించింది.ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సేవలకు మరోసారి అంతరాయం కలిగింది. ఈ సమస్యపై వేదికగా స్పందించింది. వినియోగదారుల సహనానికి ధన్యవాదాలు తెలిపింది. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని, వీలైనంత వేగంగా చక్కదిద్దుతామని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.మైక్రోసాఫ్ట్ ఈ పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. సమస్యపై తమకు అవగాహన ఉందని, పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు 365 స్టాటస్ అకౌంట్ కూడా వెల్లడించింది. లో అవుట్‌లుక్ సహా ఇతర అప్లికేషన్‌లకు సంబంధించిన సమస్యలపై అనేక మంది యూజర్లు ఫిర్యాదు నేపథ్యంలో సంస్థ ఈ అంతరాయన్ని గుర్తించినట్లు తెలుస్తోంది.మైక్రోసాఫ్ట్‌లో ఈనెల 19న తలెత్తిన అంతరాయం కారణంగా ప్రపంచవ్యాప్తంగా విండోస్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫలితంగా కంప్యూటర్లు అకస్మాత్తుగా నిలిచిపోయాయి. ఈ సమస్యను బ్లూ స్క్రీన్ ఆఫ్ ఎర్రర్‌గా పేరొన్నారు.లో అప్‌డేట్ కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో లక్షలాది మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే అదే రోజు మైక్రోసాఫ్ట్ ఈ సమస్యను పరిష్కరించింది.మైక్రోసాఫ్ట్‌లో ఇటీవల తలెత్తిన అంతరాయం కారణంగా సుమారుగా రోజంతా అనేక సంస్థలు తమ కార్యకాలాపాలను నిర్వహించలేకపోయాయి. అనేక విమానాల రద్దు సహా ఆలస్యంగా ప్రయాణాలను ప్రారంభించాయి. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యపై అనేక మంది సైబర్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. క్రౌడ్ స్ట్రైక్ సంస్థ మాత్రం దీనిపై వివరణ ఇచ్చింది. విండోస్‌లో కేవలం సాంకేతిక అంతరాయం మాత్రమే తలెత్తిందని.. ఎటువంటి భద్రతా మరియు సైబర్ అటాక్ కాదని స్పష్టంచేసింది.మైక్రోసాఫ్ట్ గతవారం మరో కీలక ప్రకటన చేసింది. భవిష్యత్‌లో మరోసారి క్రౌడ్‌స్ట్రైక్ తరహా అంతరాయం తలెత్తే అవకాశం ఉందని, ఆ పరిస్థితి రాకుండా నిరోధించే అవకాశం లేదని మైక్రోసాఫ్ట్ చెబుతోంది. థర్డ్ పార్టీ విక్రేతలకు కూడా కెర్నల్ వెర్షన్ పూర్తి యాక్సెస్‌ను పొందేలా కొత్త నిబంధనను యూరోపియన్ కమిషన్ తీసుకొచ్చింది.అంటే మైక్రోసాఫ్ట్ ఇంజినీర్లకు ఉండే స్థాయిలోనే క్రౌడ్ స్ట్రైక్ వంటి థర్డ్ పార్టీ సంస్థల ఇంజినీర్లకు పూర్తి యాక్సెస్ ఉంటుంది. దీంతో భవిష్యత్‌లోనూ సాంకేతిక సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇంతలోనే రెండు వారాల్లోనే రెండోసారి సాంకేతిక సమస్య తలెత్తింది.

## బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు ఈ నగరాల్లో ట్రయల్ రన్




ప్రభుత్వ సంస్థ తన బీఎస్ఎన్ఎల్ 4 నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు వేగంగా పని చేస్తోంది. అదే సమయంలో జియో, ఎయిర్‌టెల్ 5జీ నెట్‌వర్క్‌ను అందిస్తున్నాయి. అయినప్పటికీ బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ టెలికాం కంపెనీని మార్చగల గొప్ప ఒప్పందాన్ని పొందింది. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్..ప్రభుత్వ సంస్థ తన బీఎస్ఎన్ఎల్ 4 నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు వేగంగా పని చేస్తోంది. అదే సమయంలో జియో, ఎయిర్‌టెల్ 5జీ నెట్‌వర్క్‌ను అందిస్తున్నాయి. అయినప్పటికీ బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ టెలికాం కంపెనీని మార్చగల గొప్ప ఒప్పందాన్ని పొందింది. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కంపెనీ మొబైల్ టవర్‌ను ఉపయోగించి 5 సేవ అందించనుంది. ఇది జియో, ఎయిర్‌టెల్ కంపెనీల టెన్షన్‌ని మరింత పెంచబోతోంది. అలాగే, మొబైల్ వినియోగదారులు తక్కువ ధరలో హై స్పీడ్ డేటా, కాలింగ్ సౌకర్యాన్ని పొందవచ్చని భావిస్తున్నారు.మొదట ఈ నగరాల్లో..బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి 5 సేవలను అందించడానికి సిద్ధమవుతున్న బీఎస్ఎన్ఎల్‌తో దేశీయ టెలికాం స్టార్టప్ కంపెనీ చర్చలు జరుపుతోంది. ఇందుకోసం ట్రయల్ సర్వీస్‌ను ప్రారంభించాలని కంపెనీ ప్లాన్ చేసింది. ఈ ట్రయల్ ఒకటి నుండి మూడు నెలల్లో ప్రారంభమవుతుంది. ఇది పబ్లిక్ కాని నెట్‌వర్క్‌లపై దృష్టి పెడుతుంది. ఈ ప్రాజెక్ట్ కింద బీఎస్ఎన్ఎల్ హోల్డింగ్ 700 బ్యాండ్‌ను మొదట ఉపయోగించబడుతుంది. ఈ 5 ట్రయల్ ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి ప్రదేశాలలో నిర్వహించనుంది.పన్ను చెల్లిస్తున్నారా? ఈ పని చేయండి..లేకుంటే డబుల్ ట్యాక్స్ఏ ప్రదేశంలో ట్రయల్విచారణ జరుగుతుంది5 ట్రయల్స్ నిర్వహించబడే ప్రదేశాలలో ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలలోని ప్రముఖ ప్రదేశాలు ఉన్నాయి.కన్నాట్ ప్లేస్ ఢిల్లీప్రభుత్వ ఇండోర్ కార్యాలయం బెంగళూరుప్రభుత్వ కార్యాలయం బెంగళూరుసంచార్ భవన్ ఢిల్లీజేఎన్‌యూ క్యాంపస్ ఢిల్లీఐఐటీ ఢిల్లీఇండియా హాబిటాట్ సెంటర్ ఢిల్లీఎంచుకున్న ప్రదేశం గురుగ్రామ్ఐఐటీ హైదరాబాద్5 ట్రయల్‌కు బీఎస్ఎన్ఎల్ పూర్తి మద్దతును అందిస్తుంది. ఇందుకోసం స్పెక్ట్రమ్, టవర్లు, బ్యాటరీలు, విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కంపెనీ సిద్ధంగా ఉంది. వాయిస్ ఆఫ్ ఇండియన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఎంటర్‌ప్రైజెస్ ప్రకారం, పబ్లిక్ ఉపయోగం కోసం 5 ట్రయల్స్ అందించడానికి కంపెనీ సిద్ధంగా ఉంది. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ సీఎండీతో సమావేశమైంది.

## జనగణన పట్టదా కేంద్రాన్ని నిలదీసిన సోనియాగాంధీ



దేశంలోని జనాభాను లెక్కించే ప్రక్రియ 2021లో జరగాల్సి ఉండగా, ఇంతవరకూ జనగణన ను కేంద్రం చేపట్టలేదని, అసలు ఆ ఉద్దేశమే ఉన్నట్టు కనిపించడం లేదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు. దీంతో దేశంలో ఇతమిత్థమైన జనాభా ఎంతో తెలియకుండా పోతుందన్నారు.మీ వివాహ కలను నెరవేర్చుకోడానికి 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న కాకతీయ మ్యారేజెస్ లో ఇప్పుడు ప్రీమియం మెంబర్షిప్ ఉచితం. దేశంలోని జనాభాను లెక్కించే ప్రక్రియ 2021లో జరగాల్సి ఉండగా, ఇంతవరకూ జనగణన ను కేంద్రం చేపట్టలేదని, అసలు ఆ ఉద్దేశమే ఉన్నట్టు కనిపించడం లేదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు. జనాభాలెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యంతో దేశంలో ఇతమిత్థమైన జనాభా ఎంతో తెలియకుండా పోతుందన్నారు. దీనితో పాటు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 12 కోట్ల మంది, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు ఎలాంటి ప్రయోజనాలకు నోచుకోరని అన్నారు.న్యూఢిల్లీలో బుధవారంనాడు జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియాగాంధీ మాట్లాడుతూ, 2021లో జనాభాలెక్కల సేకరణ జరగాల్సి ఉన్నప్పటికీ అలాంటి ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చాలా స్పష్టంగా తెలుస్తోందన్నారు. తద్వారా దేశ జనాభా ఎంతనేది తెలియకుండా పోతుందని, దీనివల్ల జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద ఎస్సీ, ఎస్టీలతో సహా 12 కోట్ల మందికి ఎలాంటి లబ్ధి చేకూరదన్నారు.వయనాడ్ మృతులకు సంతాపంవయనాడ్ విలయంలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు సోనియాగాంధీ సంతాపం తెలిపారు. ఇది హృదయ విదారక ఘటన అని, ఆ రాష్ట్రంలోని మన మిత్రులంతా బాధితులకు సాయం అందిస్తున్నారని చెప్పారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వరద బాధితులకు సానుభూతి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు, నిర్వహణాలోపాలతో వరుస రైలు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారని, బాధిత కుటుంబాల పరిస్థితి తమను కలిచివేస్తోందని అన్నారు.

### బడ్జెట్‌లో రైతులు, యువతను విస్మరించారు..

కేంద్ర బడ్జెట్ 2024-25లో రైతులు, యువత డిమాండ్లను పట్టించుకోలేదని, పలు కీలక రంగాలకు కేటాయింపుల్లో న్యాయం జరగలేదని సోనియాగాంధీ అన్నారు. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణంతో కోట్లాది మంది ప్రజానీకం అతలాకుతలమవుతున్నారని, వాటి విషయం బడ్జెట్‌లో పట్టించుకోలేదని విమర్శించారు.జాతీయ భద్రత, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులపై సోనియాగాంధీ మాట్లాడుతూ, ఉగ్రదాడుల్లో పెద్ద సంఖ్యలో భద్రతా సిబ్బంది, పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు భిన్నంగా జమ్మూకశ్మీర్‌లో అంతా బాగుందంటూ మోదీ ప్రభుత్వం చెప్పుకొంటోందని అన్నారు. గత కొద్ది వారాలుగా ఒక్క జమ్మూ ప్రాంతంలోనే 11 ఉగ్రదాడి ఘటనలు జరిగాయన్నారు. మణిపూర్‌లోనూ పరిస్థితిలో పరిస్థితి కూడా మెరుగుపరడలేదని చెప్పారు. ప్రధాని ప్రపంచం మొత్తం తిరుగుతారే కానీ మణిపూర్ వెళ్లేందుకు, సాధారణ పరిస్థితి నెలకొల్పేందుకు మాత్రం ఇష్టపడటం లేదని విమర్శించారు.

### నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు...

మరి కొద్ది నెలల్లో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయని, లోక్‌సభ ఎన్నికలో చేకూరిన బలం, సాధించిన విజయాల ప్రేరణతో మనమంతా ముందుకు వెళ్లాలని సోనియాగాంధీ పార్లమెంటు పార్టీ సమావేసంలో దిశానిర్దేశం చేశారు. మితిమీరిన ఆత్మవిశ్వాసం మాత్రం ఉండకూడదని అన్నారు. పార్టీ పనితీరు బాగుంటే లోక్‌సభ ఎన్నికల ట్రెండ్స్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని తాను కచ్చితంగా చెప్పగలని అన్నారు. జాతీయ రాజకీయాల్లో మార్పు సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## క్రెడిట్ కార్డు స్టేట్‌మెంట్లో ఏముంటుంది దానికెందుకంత ప్రాధాన్యం




ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డు వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రెడిట్ కార్డును కలిగి ఉంటున్నారు. దాని ద్వారా కలిగే ఆర్థిక వెసులుబాటుతో పాటు రివార్డులు, క్యాష్ బ్యాక్ లు కూడా వీటి వినియోగం పెరగడానికి దోహదం చేస్తున్నాయి. గత ఐదేళ్ల కాలంలో చెలామణీలో ఉన్న క్రెడిట్ కార్డుల సంఖ్య రెండింతలైందని ఆర్థిక సంస్థలు నివేదిస్తున్నాయి. ప్రస్తుతం దాదాపు 100 మిలియన్లకు పైగా క్రెడిట్ కార్డులు వినియోగంలో ఉన్నట్లు చెబుతున్నారు. ఎంత విస్తృతంగా క్రెడిట్ కార్డుల వినియోగం పెరుగుతుందో.. అంతే స్థాయిలో మోసాలు పెరుగుతున్నాయి. మరో వైపు క్రెడిట్ కార్డును ఎలా వాడాలో అర్థం చేసుకోలేని కొంత మంది వినియోగదారులు చేసే తప్పుల వల్ల కూడా నష్టపోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటువంటి ప్రమాదాల నుంచి తప్పించుకోవాలంటే.. ఉపయోగపడే ఏకైక అస్త్రం క్రెడిట్ కార్డు స్టేట్ మెంట్. ప్రతి నెలా ఆయా బ్యాంకులు వినియోగదారులకు ఈ స్టేట్ మెంట్ ను అందిస్తాయి. దీనిని సక్రమంగా చూసుకోవడం ద్వారా లోపాలను గుర్తించడంతో పాటు మోసాన్ని నిరోధించేందుకు మంచి ఆరోగ్యకరమైన ఆర్థిక ప్రొఫైల్ ను నిర్వహించడంలో మీకు సహాయపడుతుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు స్టేట్ మెంట్లో చూసుకోవాల్సిన అంశాలు ఏమిటి? తెలుసుకుందాం రండి..క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ అంటే ఏమిటి?క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ అనేది క్రెడిట్ కార్డ్ జారీచేసేవారు అందించే నెలవారీ సారాంశం. ఇది ఆ కార్డుపై నిర్దిష్ట బిల్లింగ్ వ్యవధిలో చేసిన అన్ని లావాదేవీలను వివరిస్తుంది. ఈ పత్రం ఆర్థిక నిర్వహణకు కీలకమైనది. ఎందుకంటే కార్డ్ హెూల్డర్‌లు వారి ఖర్చు అలవాట్లను అర్థం చేసుకోవడం, చెల్లింపులను ట్రాక్ చేయడం, ఏవైనా వ్యత్యాసాలు లేదా అనధికార ఛార్జీలను గుర్తించడంలో సహాయపడుతుంది.ఈ అంశాలను తనిఖీ చేయండి..క్రెడిట్ కార్డు స్టేట్ మెంట్లో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవేంటంటే..స్టేట్‌మెంట్‌లో జాబితా చేసిన అన్ని ఛార్జీలు, లావాదేవీలను ధ్రువీకరించండి. ఏదైనా అనధికార లావాదేవీలు లేదా బిల్లింగ్ మొత్తాలలో లోపాలు ఉన్నాయా అనే విషయం గురించి తనిఖీ చేయండి.మీరు స్టేట్‌మెంట్‌లోని ప్రతి ఎంట్రీని గుర్తించండి. ఏవైనా అనుమానాస్పద లావాదేవీలు ఉంటే వాటిని బ్యాంకు అధికారులకు నివేదించండి. అది మోసాలను నిరోధించడంలో సహాయపడుతుంది.చెల్లింపు గడువు తేదీ, బకాయి కనీస మొత్తాన్ని గమనించండి. గడువు తేదీలోపు కనీసం కనిష్టాన్ని చెల్లించడం వల్ల ఆలస్య రుసుములను నివారించవచ్చు. ఇది మీ క్రెడిట్ స్కోర్‌ను నిర్వహించడంలో సహాయపడుతుంది. మీరు మీ చెల్లింపులను సకాలంలో చేసినట్లు నిర్ధారించుకోండి.మీరు విదేశాల్లో మీ కార్డ్‌ని ఉపయోగించినట్లయితే లేదా విదేశీ కరెన్సీలలో కొనుగోళ్లు చేసినట్లయితే, విదేశీ లావాదేవీల రుసుములను తనిఖీ చేయండి. అవి మీ ఖర్చులకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించుకోండి.వడ్డీ రేట్లు లేదా ఇతర ముఖ్యమైన అప్‌డేట్‌లలో మార్పులను ప్రకటించడానికి బ్యాంకులు తరచుగా క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ చివరిలో సందేశాల విభాగం లేదా ఫుట్‌నోట్‌లను ఉపయోగిస్తాయి. మీరు మీ స్టేట్‌మెంట్‌లో అలాంటి సందేశాలు ఏమైనా ఉన్నాయేమో చూసుకోండి.మీ క్రెడిట్ పరిమితి, అందుబాటులో ఉన్న క్రెడిట్‌పై ఓ కన్ను వే ఉంచండి. ఈ సమాచారం మీ ప్రస్తుత వినియోగ నిష్పత్తిని అర్థం చేసుకోవడంలో మీకు సహాయపడుతుంది.మీరు యుటిలిటీ బిల్లులు చెల్లించడానికి లేదా ప్రభుత్వ చెల్లింపులు చేయడానికి మీ క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగించినట్లయితే, ఏవైనా సౌకర్యాల రుసుములను తనిఖీ చేయండి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com